క్లుప్తంగా

ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న పల్లె నరసింహారెడ్డి

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని స్వామినగర్ కాలనీలో నివాసం ఉంటున్న కిరణ్ దంపతులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కిరాణా షాపు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎంపీడీఓ కార్యాలయ ప్రహరీగోడ షాపుమీద పడి కూలిపోయింది. విషయం తెలుసుకున్న పట్టణానికి చెందిన ప్రకృతి పీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి షాపు పున: నిర్మాణానికి తన వంతు సాయంగా శుక్రవారం ఆ దంపతులకు రూ. 5వేలు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సుధాకర్, ప్రకృతి పీఠం సభ్యులు సుబ్బయ్య, రమేష్, శివ, మురళీ పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రవి ప్రసాద్

బేతంచెర్ల: బోధనతోపాటు ఉన్నత విలువలునేర్పి విద్యార్థులను ఉత్తమ పౌరులగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ రవి ప్రసాద్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంఈఓ సోమశేఖర్, ఈఓఆర్డీ వెంకట రంగనాయక్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయాలన్నారు. ప్రతి రోజు బోధనతోపాటు, కథలు, మానసిక ప్రశాంత కల్గించే ఆటపాటలతో పాటు యోగాపై అవగాహన కల్పించాలని సూచించారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



ధరణి లక్ష్మికి నగదు అందజేస్తున్న దాతలు

సంజామల: పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన మండల పరిధిలోని ఆకుమల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం దాతలు ఏరాశి లక్ష్మిదేవి, డాక్టర్ ఏరాశి రమేష్ రెడ్డి, బొల్లవరం వెంకటలక్ష్మమ్మ ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ధరణి లక్ష్మికి (572 మార్కులు) రూ.15 వేలు, తేజేశ్వర్‌కు (536 మార్కులు) 10 వేలు, మాహిన్‌కు (482 మార్కులు) రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రామచంద్ర రెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ ఉసేని,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సోమశేఖర్

బేతంచెర్ల: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంఈఓ సోమశేఖర్ హెచ్చరించారు. పట్టణంలోని శుక్రవారం శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో ఎంఈఓ సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలల ఆవరణలో నోటీస్ బోర్డులో గుర్తింపు పత్రాన్ని, ఫీజుల వివరాలను ఉంచాలన్నారు. అలాగే పుస్తకాలు, యూనిఫామ్‌ల విక్రయాలు చేయకూడదన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కార్యాలయం డీటీపీ సురేష్, ఎంఐఎస్‌లు ఆచారి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ



బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరంలో వెలసిన చౌడేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి పల్లకీ సేవా కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయ అసిస్టెంటెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి కుంకుమార్చన అభిషేకం తదితర పూజలు జరిగాయి. సాయంత్రం పల్లకీ సేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

కోవెలకుంట్ల: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం కలుగుతుందని వక్తలు అభిప్రాయ పడ్డారు. బనగానపల్లె నియోజకవర్గంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కోవెలకుంట్ల పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈఓలు వెంకట్రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, హెచ్ఎం రాజయ్య ఆధ్వర్యంలో, వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం అరుణకుమారి ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ శారీరక, మానసిక అభివృద్ధికి విద్యార్థి దశ నుంచే యోగ విద్యను అలవర్చుకోవాలని సూచించారు. భారతీయ సంస్కృతిని తెలియజేసేలా యోగ విద్యపై అవగాహన కల్పించారు. అనంతరం యోగాలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ గోపినాథ్, అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, కృష్ణదాసు, శశాంక, రాజు, రాజశేఖర్, లక్ష్మిదేవి, అన్నపూర్ణ, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఇన్‌చార్జ్ జడ్జి అబ్దుల్ రహిమాన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా యోగా గురువు తిరుమలయ్య యోగాసనాలు వేసేవిధానాన్ని వివరించారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ సభ్యులు, సీనియర్ జూనియర్ న్యాయవాదులు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవుకు: అంగన్‌వాడీ సెంటర్‌లలో శుక్రవారం యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులతో యోగా చేయించి, ప్రయోజనాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శివమ్మ, పావని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బనగానపల్లె రూరల్ : యోగా పాటించడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవితం సాగించవచ్చునని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధవరావు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాయామ అధ్యాపకురాలు విజయకుమారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ అధ్యాపకులు ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాధవరావు మాట్లాడుతూ యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సూర్యనారాయణరెడ్డి, వసుంధర, సుధాకర్‌రెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, మహమ్మద్‌గౌస్, కౌసల్యాదేవి, నీతమ్మ, రవికుమార్, నాగతిమ్మయ్య, వరలక్ష్మీ, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

సంజామల: మండల కేంద్రం సంజామల కస్తూర్బా విద్యాలయంలో పిన్సిపాల్ శ్రీలేఖ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ యోగ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులతో యోగాసనాలు చేయించారు. కార్యక్రమంలో ఐసిడీసీ సూపర్‌వైజర్ శాంత, మహిళ పోలీస్ నసూల్‌బీ తదితరులు పాల్గొన్నారు.



మోడల్ స్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

కొలిమిగుండ్ల: ఆధునిక జీవితంలో ప్రతి ఒక్కరూ అనేక ఒత్తిళ్లకు లోనవుతున్నారని యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కొలిమిగుండ్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలలో విద్యార్థులతో పలు యోగసానాలు చేయించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పక యోగా చేయాలన్నారు. ఆరోగ్యంతో పాటు మెదడు చురుగ్గా ఉంటుందన్నారు. యోగా చేసే పద్ధతులు,తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

డోన్ టౌన్ : డోన్ పట్టణంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో డాక్టర్ గ్రేస్ సెలష్టియల్, యోగా కేంద్రంలో యోగా గురూజీ రాంపుల్లయ్య, నెహ్రూ, పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో యోగా శిక్షకులు రవీంద్రవర్మ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. యోగాసానాలు వేయించారు. అనంతరం యోగా శిక్షకుడు రవీంద్రవర్మను నెహ్రూనగర్, పాతపేట జెడ్పీ హైస్కూల్ హెచ్ఎంలు తొగట సురేష్‌బాబు, వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. గురూజీ రాంపుల్లయ్యను గీతా యోగాసనం సంఘం సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో వారు యోగాసనాల ప్రాముఖ్యతను వివరించారు. యోగా, ధ్యానం చేస్తే సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని సూచించారు.

ప్యాపిలి: ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ యోగా అంటే వ్యాయామం మాత్రమే కాదని..శారీరక, మానసిక వికాసాన్ని కలిగించే దివ్య ఔషధం అన్నారు. అనంతరం సరస్వతి శిశు మందిరం ఉపాధ్యాయుడు వాసు ద్వారా విద్యార్థులకు యోగాసనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ నవీనపాటి, లెక్చరర్లు రామకృష్ణయ్య, నవీన్, సత్యబాబు, ఓబులేసు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, సమరసత సేవా ఫౌండేషన్, వీరబ్రహ్మేంద్ర ధ్యాన పిరమిడ్ కేంద్రంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. అలాగే సరస్వతి శిశు మందిర్ స్కూల్‌లో బేతంచెర్ల వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గుప్త, వెంకటరమణ, కోశాధి కారి మధు సురేంద్ర ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయా కార్యాక్రమాల్లో యోగాసనాలు వేశారు. యోగా ప్రాముఖ్యతను వివరించారు. యోగా చేయడం వలన మానసిక ప్రశాంతి కల్గుతుందని మండల పరిధిలోని గోర్లగుట్ట ప్రాథమికోన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ఫర్హత్ జహాన్ తెలిపారు. కార్యక్రమంలోయోగా మాస్టర్లు రాఘవేంద్ర, అజయ్, సమరసత సేవా ఫౌండేషన్ నంద్యాల డివిజన్ సహకన్వీనర్ నాగమోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు నసీం, మారుతి దేవి, శివ కుమార స్వామి, వరలక్ష్మి, మురళీ, రంగస్వామి పాల్గొన్నారు.



చిన్నారులతో యోగాసనాలు చేయిస్తున్న సూపర్‌వైజర్లు శివమ్మ, పావని



యోగాసనాలు వేయిస్తున్న యోగా గురువు తిరుమలయ్య



కార్యక్రమంలో మాట్లాడుతున్న చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధవరావు



యోగాసనాలు చేస్తున్న విద్యార్థినులు



రవీంద్రనాథ్‌శర్మను సత్కరిస్తున్న దృశ్యం



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



యోగా చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



ధ్యానం చేస్తున్న విద్యార్థినులు

24న ఆలయ భూముల కౌలు వేలం

కొలిమిగుండ్ల: మండంలలోని గొర్విమానుపల్లె సమీపంలోని లొక్కిగుండం రామేశ్వరస్వామి ఆలయం, పెట్నికోటలోని ఆంజనేయస్వామి, శివాల యం ఆలయాలకు చెందిన భూములు కౌలు సాగు కు సంబంధించి ఈనెల 24న వేలం పాటలు నిర్వ హిస్తున్నట్లు ఈఓ వీరయ్య శుక్రవారం తెలిపారు. ఉదయం గొర్విమానుపల్లె, మధ్యాహ్నం పెట్నికోట లో వేలం పాట నిర్వహించనున్నట్లు ఆయన చెప్పా రు. రెండేళ్ల కొక సారి దేవదాయ శాఖ పరిధిలో ఉన్న భూములకు వేలం నిర్వహిస్తున్నామన్నారు.

కామాంధులను కఠినంగా శిక్షించాలి

కోవెలకుంట్ల: సత్యసాయి జిల్లాలో ఇటీవల ఓ దళిత యువతిపై అత్యాచారం చేసి హత్య చేసిన కామాంధులను కఠినంగా శిక్షించాలని అంబేడ్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మహేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బుక్కపట్నం మండలం మారాల గ్రామానికి చెందిన దళిత యువతిని ప్రేమపేరుతో వంచించి ఓ యువకుడు తన స్నేహితులతో కలిసి అత్యాచారం చేయడంతో పాటు హత్య చేశాడన్నారు. ఈ ఘటనకు పాల్పడిన యువకులను అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు చేపట్టి యువతి కుటుంబానికి అండగా నిలువాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

నలుగురు బైండోవర్

అవుకు: మండల పరిధిలోని నలుగురి వ్యక్తులపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్ బాబు శుక్రవారం తెలిపారు. ప్రజల శాంతిభద్రతలకు భంగం కలుగకుండా, గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. శివవరం గ్రామానికి చెందిన గుత్తి లలితమ్మ, గుత్తి హెప్సిబా, పెరుమాల కరుణమ్మ, పెరుమాల రత్నమ్మను బైండోవర్ చేశామని ఎస్ఐ తెలిపారు.

మోడల్ స్కూల్‌లో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోండి

బేతంచెర్ల: మండలంలోని గోరుమానుకొండ ఏపీ మోడల్ స్కూల్‌లో 7,8,9 తరగతుల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మర్యాదాస్ శుక్రవారం తెలిపారు. ఏడు, ఎనిమిది, తొమ్మిదవ తరగతుల్లో వరుసగా రెండు, ఒకటి, రెండు సీట్లు చొప్పున ఖాళీగా ఉన్నాయన్నారు. 24వ తేదీ(సోమవారం) ఉదయం10 గంటలకు మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. అదేరోజు దరఖాస్తులు అందజేసి విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంటుందని, మార్కుల ఆధారంగా సీటు కేటాయిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

గొర్రెల దొంగలకు టీడీపీ నాయకుల వత్తాసు!

డోన్ : మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన పైగేరి చిన్న పెద్దయ్యకు సంబంధించిన గొర్రెను ఈ నెల 20వ తేదీన అదే గ్రామానికి చెందిన గొల్ల యాగంటి, జింకల రామాంజనేయులు, అయ్యస్వామితోపాటు మరికొందరు గొర్రెను ఎత్తుకెళ్లి కోసుకోని తిన్నారని బాధితుడు రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు శుక్రవారం రూరల్ పోలీసులు నిందితుల్లో కొందరిని అదుపులోకి తీసుకోని విచారణ చేస్తుండగా అదే గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు రూరల్ పోలీసులపై ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. పూర్తిస్థాయిలో విచారణ చేయకుండా రాజకీయ ఒత్తిడి పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గొర్రెలను దొంగతనం చేసి విక్రయించే వారికి కొందరు టీడీపీ నాయకులు వత్తాసు పలుకడమేంటని ప్రశ్నిస్తున్నారు గ్రామస్తులు. గ్రామంలో వ్యవసాయ పంట దిగుబడులు, వ్యవసాయ పరికరాలు, పశువులు, ఎద్దులు కూడా తరచు దొంగతనాలకు గురవుతున్నట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిపై పోలీసులు విచారించి నిక్కచ్చిగా వ్యవహరించాలని, అక్రమార్కులపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

వేధింపుల కేసు నమోదు

బేతంచెర్ల: మండలంలోని ఆర్. కొత్తపల్లె గ్రామానికి చెందిన తలారి కవితను గత 3 సంవత్సరాల కిందట గోస్పాడు మండలం యాళ్లూరు గ్రామానికి చెందిన ఆలమూరి రమేష్ కు ఇచ్చి వివాహం జరిపించారు. కొన్ని రోజులుగా అదనపు కట్నం తేవాలంటూ తరచూ భర్త ఆలమూరి రమేష్, మామ వెంకటేశ్వర్లు, అత్త తిరుపాలమ్మ, బావ చంద్రశేఖర్ వేధింపులకు గురిచేస్తున్నారంటూ బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నలుగురిపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప శుక్రవారం తెలిపారు.

గరుడవాహనంపై దర్శనమిచ్చిన బుగ్గ వేంకటేశ్వరుడు

సంజామల: మండల పరిధిలోని నొస్సం గ్రామంలో వెలసిన బుగ్గ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. పది రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా 7వ రోజు శుక్రవారం శ్రీదేవి,భూదేవి సమేత బుగ్గ వేంకటేశ్వర స్వామి శుక్రవారం గరుడవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త గాధం శెట్టి శ్రీరాముడు, ఈఓ చంద్రుడు, అర్చకుడు శ్రీకాంత్ శర్మ అధ్వర్యంలో స్వామివారి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బనగానపల్లెలో కుక్కల బెడద!

బనగానపల్లె : బనగానపల్లె పట్టణంలో కుక్కల బెడద ఎక్కువ అయ్యింది. దీంతో ప్రజలు భయం దోళన చెందుతున్నారు. కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తూ ప్రజలను కాటేస్తున్నాయి. ఇప్పటికే చాలా మంది కుక్కకాటుకు గురయ్యారు. ఎప్పుడు ఎక్కడి నుంచి దాడి చేస్తాయోనని ప్రజలు భయపడుతున్నారు. ద్విచక్రవాహన చోదకుల వెంటపడి కాటేస్తున్నాయి. వాటి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో వాహనచోదకులు కిందపడి గాయపడి సందర్భాలు లేకపోలేదు. అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



పట్టణంలో సంచరిస్తున్న కుక్కలు

నాటు కాసరకు భలే గిరాకీ



బనగానపల్లె : ప్రతి ఒక్కరూ ఇష్టపడే నాటుకాసరకాయలకు మార్కెట్‌లో భలే గిరాకీ ఏర్పడింది. కిలో దాదాపు రూ.250 వరకు వీటిని విక్రయిస్తున్నారు. ధర ఎక్కువగా ఉన్నా వీటిని కొనుగోలు చేస్తున్నారు ప్రజలు. ఆరోగ్యానికి ఉపయోగకరమని ధర ఎక్కువైనా కాసరను కొంటున్నారు. గతంలో బనగానపల్లె, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, సంజామల మరికొన్ని ప్రాంతాల్లో నాటుకాసర కాయలు పొలాల్లో లభించేవి. కొంత కాలంగా ఈ కాసర కాయలు కనుమరుగయ్యాయి. డోన్, ప్యాపిలి ప్రాంతాల నుంచి నాటు కాసరకాయలు ఇక్కడికి సరఫరా అవుతున్నాయి. గతేడాది కిలో రూ.120–150 వరకు ఉండగా ప్రస్తుతం రూ.250 వరకు విక్రయిస్తున్నారు వ్యాపారులు.

అవుకులో చోరీ

అవుకు: మండలం కేంద్రం అవుకులో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుకాణా దారుడు, పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాజా వీధిలో ఉన్న షణ్ముఖ ఫ్యాన్సీస్టోర్ దుకాణదారుడు ప్రతిరోజూ లాగానే రాత్రి పది గంటల సమయంలో షాప్‌ను మూసేసి తాళాలు వేసుకొని వెళ్లాడు. ఉదయాన్నే దుకాణాన్ని తెరవాలని వచ్చేసరికి తాళం పగులి ఉంది. దుకాణంలోకి వెళ్లి చూడగా రూ.80వేలు నగదుతో పాటు, రూ.3లక్షలు విలువ సిగరెట్స్ బండల్స్ దొంగతనానికి గురయ్యాయినట్లు గుర్తించాడు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు దొంగతనానికి గురైన దుకాణాన్ని పరిశీలించి, దుకాణాదారుడిని పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



చోరీ జరిగిన దుకాణాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వైభవంగా తిరుచ్చి వేడుకలు

బేతంచెర్ల: మండలపరిధిలోని మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో జ్యేష్ఠ మాస పౌర్ణమి శుక్రవారం స్వామి వారికి తిరుచ్చి మహోత్సవం భక్తజనసందోహం మధ్య వైభవంగా జరిగింది. ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు వేదపండితులు కళ్యాణ చక్రవర్తి, ప్రధాన అర్చకుడు మద్దిలేటి స్వామి ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేతుడైన మద్దిలేటి నరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీల్లో స్వామి,అమ్మవార్లను ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో అర్చకులు మనోహర్, నరసింహ, భక్తులు పాల్గొన్నారు.



ఆలయ మాడవీధుల్లో మద్దిలేటయ్యను ఊరేగిస్తున్న భక్తులు

రెవెన్యూ సిబ్బందికి ఉత్తమ సేవకులుగా అవార్డులు



ఉత్తమ వీఆర్వో అవార్డు అందుకుంటున్న రాజు

డోన్ టౌన్ : రెవెన్యూ దినోత్సవం సందర్భంగా డివిజన్‌లో పని చేస్తున్న పలువురు అధికారులు, సిబ్బంది ఉత్తమ సేవకులుగా అవార్డులు పొందారు. జిల్లా కేంద్రం నంద్యాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేవ్ అధికారిగా పని చేస్తున్న రాజశేఖర్‌బాబు, బేతంచెర్ల తహసీల్దార్ జీవన్ చంద్రశేఖర్, ప్యాపిలి డిప్యూటీ తహసీల్దార్ మారుతి, డోన్ మండల సర్వేయర్ జగదీష్‌కుమార్, వీఆర్‌ఓ ఆర్.ఎ.రాజు, కామగాని కుంట్ల వీఆర్‌ఏ మధుబాబులకు ఉత్తమ సేవకులుగా అవార్డులు అందుకున్నారు.

నేడుస్లో డ్రైవింగ్ పోటీలు

సంజామల: మండల పరిధిలోని నొస్సంలో వెలసిన బుగ్గ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం మోటార్ సైకిల్ స్లో డ్రైవింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పగడాల ఆంజనేయులు తెలిపారు. విజేతలకు వరుసగా రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, రూ. వెయ్యి చొప్పున అందజేస్తామన్నారు. ఆలయ కమిటీ సభ్యుల దగ్గర పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి

బనగానపల్లె రూరల్ : బడిఈడు పిల్లలు తప్పనిసరిగా బడిలో ఉండాంటూ శుక్రవారం సీఆర్ఎంటీ శివరామమద్దిలేటి పట్టణంలో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ పాఠశాలలో 5వ తరగతి పూర్తి చేసుకొని టీసీ తీసుకెళ్లిన 54 మంది విద్యార్థినీ,విద్యార్థుల ఇంటి వద్దకు వెళ్లి తల్లిదండ్రులతో ఆయన మాట్లాడారు. విద్య ప్రాముఖ్యతను వివరించి విద్యార్థులు 6వ తరగతిలో ప్రభుత్వ పాఠశాలల్లోనే చేరే విధంగా తల్లిదండ్రులను చైతన్య పరచారు. కార్యక్రమంలో హెచ్ఎం రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు వాహిద్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

సంజామల: మండల కేంద్రం సంజామల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న అనిల్ కుమార్ ఉత్తమ ప్రతిభ అవార్డు పొందారు. ఈ మేరకు శుక్రవారం రెవె న్యూ కార్యాలయంలో డీటీ అనిల్‌కుమార్‌కు సిబ్బంది ఘనంగా సన్మానించారు.



డీటీ అనిల్ కుమార్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది